# మంత్రుల కాళ్లు మొక్కాలా...

## పోచారం సంచలన వ్యాఖ్యలు



బాన్సువాడ, బతుకమ్మ : వర్ని మండలం సిద్దాపూర్ రిజర్వాయర్ వద్ద ఆదివారం రాత్రి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. మంత్రులపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

**మంత్రులు ఫోన్ ఎత్తడం లేదు**

పెండింగ్ బిల్లుల విషయమై మంత్రులకు ఫోన్ చేస్తే ఎత్తడం లేదని.. ప్రభుత్వసలహాదారుగా, సీనియన్ ఎమ్మెల్యేగా ఉన్న తన ఫోన్కాల్ లిఫ్ట్ చేయకపోవడం ఎంత వరకు సబబని ఆయన ప్రశ్నించారు. సీఎంకు సుమారు 20 సార్లు ఫోన్ చేసినా స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. “సీనియర్ ఎమ్మెల్యే అయిన నా ఫోన్ కూడా ఎత్తడం లేదని, ఇక నేను మంత్రుల కాళ్లు మొక్కాలా?” అని ప్రశ్నించారు. బిల్లులు రాక పనులు ఆగిపోతున్నాయని, ప్రభుత్వం నుంచి బిల్లులు విడుదల కాకపోవడంతో అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయని తెలిపారు.

**కాంట్రాక్టర్లు పనులు వదిలి వెళ్లిపోతున్నారు**

కాంట్రాక్టర్లు పనులు వదిలి వెళ్లిపోతున్నారని, బిల్లులు రాక ఎలా పని చేయాలని వారు ప్రశ్నిస్తున్నారని పోచారం పేర్కొన్నారు. అయినప్పటికీ కాంట్రాక్టర్లను బతిమిలాడుతూ పనులు కొనసాగిస్తున్నామని చెప్పారు. 20 ఏళ్లు మంత్రిగా పనిచేసిన తాను ఎవరైనా ఫోన్ చేస్తే అర్ధరాత్రి అయినా స్పందించేవాడినని, కానీ ఇప్పుడు మంత్రులు ఫోన్ ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన రాజకీయ జీవితంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదని పోచారం వ్యాఖ్యానించారు. ప్రజల కోసమే ఫోన్ చేస్తున్నాం.. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే మంత్రులను సంప్రదిస్తున్నామని, అలాంటి సందర్భాల్లో కూడా స్పందన లేకపోతే ప్రజాప్రతినిధుల పాత్ర ఏమిటని ప్రశ్నించారు.

## తమ ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవద్దు

### వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ ఆర్మూర్ లావణ్య



నవీపేట, బతుకమ్మ :ఆరుగాలం కష్టపడి పండించిన రైతులు తామ ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఆర్మూర్ లావణ్య అన్నారు. నవిపేట్ మండలం నాళేశ్వర్ గ్రామంలో బినోల పిఎసిఎస్ ఆద్వర్యంలో సోమవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మట్లాడుతూ రైతులు తాము పండించిన వరి ధాన్యన్ని తాలు తప్ప లేకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చి మద్దతు ధర ఏ గ్రేడ్ 2389, బి గ్రెడ్ కు 2369 ధరను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆర్మూర్ శ్రీనివాస్, సోసైటి సేక్రేటరి రమేష్, మాజి సోసైటి చైర్మన్ మగ్గరి హన్మండ్లు, మాజి సర్పంచ్ లు సాయరేడ్డి, నర్సింగ్ రావు, సరీన్, మాజి యం.పి.టి.సి లక్ష్మణ్, గ్రామ కమిటీ సభ్యులు కుమ్మరి రాజు, లక్ష్మణ్, మోహన్, రాజేందర్, జనార్ధన్, సంజీవ్ రైతులు భీంరేడ్డి, బోజరాం, సాయిలు, పోతన్న, శ్రీకాంత్, రాజేశ్వర్, పోతన్న, పోశేట్టి తదితరులు ఉన్నారు.

## భక్తుల శివనామస్మరణలతో మారుమోగిన సిద్ధరామేశ్వరాలయం



భిక్కనూరు బతుకమ్మ: భిక్కనూరు మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం సిద్ధ రామేశ్వర స్వామి స్వయంభు లింగ మహాక్షేత్రంలో చైత్రమాసం కృష్ణ ఏకాదశి సోమవారం సందర్భంగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడంతో పాటు సత్య నారాయణ స్వామి వ్రతాలు, పుట్టువెంట్రుకలు వంటి కైంకర్యాలు భక్తిశ్ర ద్ధలతో నిర్వహించి స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. ఆలయ పరిస రాలు భక్తులతో కళకళలాడాయి. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెం దిన ప్రముఖ వ్యాపారి చంద్రమౌళి గుప్త ఆధ్వర్యంలో అన్నదాన కార్య క్రమం ఘనంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు ఈ అన్నదానంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. అన్నదానం నిర్వహిం చిన చంద్రమౌళి గుప్త కుటుంబ సభ్యులకు స్వామివారి ఆశీస్సులు లభిం చాలని ఆలయ ఆనువంశ అర్చకులు కొడకండ్ల రామగిరి శర్మ ఆకాం క్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షులు తాటిపాముల లింబాద్రి, ఉపాధ్యక్షులు అందెదయాకర్ రెడ్డి, సభ్యులు నీలా అంజయ్య, చీకోటి ప్రభాకర్ గుప్త, నాగర్తి రమేశ్ రెడ్డి, బాపురెడ్డి, నారాయణ, బాగయ్య తదితరులు ఉన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

వేల్పూర్, బతుకమ్మ :తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. వేల్పూర్ మండలంలోని రామన్నపేట గ్రామంలో మహిళా సమైక్య ఆధ్వర్యంలో సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. మహిళా సంఘాలకు పావుల వడ్డీ రుణాలు సైతం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీఎన్జీవోస్ ఉపాధ్యక్షుడు బత్తుల మాణిక్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యంరెడ్డి, రామన్న పెట్ సర్పంచ్ బెల్లరి నవీన్, ఉప సర్పంచ్ తెడ్డు గోవర్ధన్, ఐకెపి సీసీలు మురళీ, రామడుగు మోహన్, పొన్నాల చిన్నయ్య వీవోఏ మాణిక్ రావు తదితరులు పాల్గొన్నారు.



## డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడమే ప్రధాన లక్ష్యం

### నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రజల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడమే అరైవ్ అలైవ్ ప్రధాన లక్ష్యమని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం, ప్రజల్లో ట్రాఫిక్ నియమాల పట్ల బాధ్యతాభావం పెంపొందించడం లక్ష్యంగా “అరైవ్ అలైవ్ ” కార్యక్రమాన్ని ఏప్రిల్ 13 నుండి 18 వరకు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం నిజామాబాద్ టౌన్ 6 పోలీస్ స్టేషన్ పరిధిలోనీ శాస్త్రి నగర్ లో ఏర్పాటు చేసిన గ్రామ సభ కార్యక్రమం లో సీపీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఇతర ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వంటి అంశాలేనని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనం నడిపి, తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయని, అలాంటి సంఘటనలు కుటుంబాలకు తీరని నష్టాన్ని కలిగిస్తాయని తెలియజేసారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు తెలియజేసేటటువంటి పాంప్లెంట్లు, పోస్టర్లను విడుదల చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో చెట్లు నాటారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఇన్ చార్జి ఏసిపి రాజా వెంకటరెడ్డి, ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ, సౌత్ రూరల్ సురేష్ కుమార్, ట్రాఫిక్ సిఐ ప్రసాద్, ట్రాఫిక్ రిజర్వ్ ఇన్స్ పెక్టర్ వినోద్, టౌన్ 6 ఎస్ఐ వెంకట్ రావ్, జిల్లా మోటార్ వెహికల్ ఇన్స్ పెక్టర్ బి.కిరణ్ కుమార్, ఎస్ ఐ డి.శ్రీకాంత్, గ్రామ సర్పంచ్ నరాల జ్యోతి, డివిజనల్ పంచాయతీరాజ్ ఆఫీసర్ శ్రీనివాస్, వార్డు మెంబర్లు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి నిరోధక శాఖ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన సీపీ





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నిజామాబాద్ జిల్లాలో నూతన అవినీతి నిరోధక శాఖ కార్యాలయాన్ని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ లో పాత ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ దగ్గర ఏసీబీ నూతన కార్యాలయాన్ని సోమవారం సీపీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసీబీ కి ఫిర్యాదు చేయాలనుకుంటే టోల్ ఫ్రీ నెంబర్ 1064 కి కాల్ చేయాలని సూచించారు. ఈ ప్రారంబోత్సవానికి హైదరాబాద్ ఏసీబీ వెస్ట్ జోన్ డిప్యూటి డైరెక్టర్ డి. కమలాకర రెడ్డి, నిజామాబాద్ ఏసీబీ డిఎస్పి జి.శేకర్ గౌడ్, ఇన్స్ పెక్టర్స్ యం.వేణుకుమార్, జి.నగేష్, ఏసీబీ సిబ్బంది హాజరయ్యారు.

## నేడు మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు...




రుద్రూర్ (వర్ని), బతుకమ్మ : డా. బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని వర్ని మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద స్వామి వివేకానంద బ్లడ్ డోనర్స్ వారి ఆధ్వర్యంలో బ్లడ్ డోనర్స్ ఫౌండర్ సంతోష్ సహకారంతో తలసేమియా బాధిత చిన్నారుల కోసం మెగా రక్తదాన శిభిరం ఏర్పాటు చేస్తున్నట్లు బ్లడ్ డోనర్స్ ఫౌండర్ సంతోష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున యువకులు, పెద్దలు అధిక సంఖ్యలో ముందుకు వచ్చి ఈ రక్తదాన శిభిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.